



DD9 వార్త
తెలుగు దినపత్రిక

యుద్ధ మేఘాల మధ్య 'డ్రాగన్' షూటింగ్..
చివరి నిమిషంలో ఎన్టీఆర్ సేఫ్!




సంపుటి : 01 సంచిక : 192 హైదరాబాద్, మార్చి, ఆదివారం 01, 2026 పేజీలు : 06 వెల : 3.00

# కాకినాడలో మహా విషాదం..!

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు



- 21 మంది మృతి,
- పలువురికి తీవ్ర గాయాలు
- పేలుడు ధాటికి పొలాల్లోకి ఎగిరిపడ్డ మృతదేహాలు
- క్షణాల్లో నేలమట్టమైన చుట్టు పక్కల భవనాలు
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- క్షతగాత్రులకు వైద్య సాయంపై ఆదేశాలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):** కాకినాడ జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సామర్లకోట మండల పరిధిలో వేట్లపాలెం–జి.మేడపాడు గ్రామాల మధ్య గోదావరి కాలువ సమీపంలో ఉన్న సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ అనే బాణసంచా తయారీ కేంద్రంలో అకస్మాత్తుగా భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో అక్కడే పనిచేస్తున్న 21 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మందికి పైగా తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే అక్కడ ఉన్న భవనాలు క్షణాల్లో నేలమట్టమయ్యాయి. మంటలు ఎగిసిపడి దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా భయంతో ఇళ్ల బయటకు పరుగులు తీశారు. పేలుడు ధాటికి అక్కడ పనిచేస్తున్న కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. కొంతమంది శరీర భాగాలు సమీప పొలాల్లో పడిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దృశ్యాలు చూసిన గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. పేలుడు శబ్దం దాదాపు ఐదు కిలోమీటర్ల

..మిగతా 3లో

# వ్యక్తిగతంగా పరిశీలిస్తా..

- 99 రోజుల కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం
- సచివాలయంతో ఉన్నతాధికారులతో కీలక సమీక్ష
- కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కావొద్దని సూచన
- శారదాపీఠం భూములపై కీలక నిర్ణయం
- జల మండలికి కేటాయించిన భూములు రద్దు
- సౌదీ బస్సు ప్రమాద బాధితులకు సాయం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయ, పరిపాలనా పరిణామాలు ఒకేరోజు పలు కీలక మలుపులు తీసుకున్నాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పలు అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శారదాపీఠం భూముల వ్యవహారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాకినాడ పేలుడు ఘటనపై

..మిగతా 2లో



# దేవుడి మాన్యాలపై ప్రభుత్వం కన్ను

- కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం అంటే గుళ్లు, గోపురాలు కూల్చడమేనా?
- శారదా పీఠం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం శుభపరిణామం
- ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా చేపట్టే చర్యలపై పోరాడుతూనే ఉంటాం

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకరదాడి

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు
- అనేక ప్రాంతాల్లో అలుముకున్న దట్టమైన పొగ
- ఇరాన్ నుంచి ప్రతిదాడులు జరిగే అవకాశం
- ఇజ్రాయెల్ లో హై అలర్ట్.. స్కూళ్లు, దుకాణాలు బంద్
- ఈ దాడుల వెనుక అమెరికా ఉందా?




# మౌలిక వసతులే అభివృద్ధికి పునాది

- రాష్ట్రంలో ప్రత్యేక ప్రణాళికలతో అమలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ
- బిల్డర్స్ అసోసియేషన్ మీటింగ్‌లో పాల్గొన్న మంత్రి
- అభివృద్ధిలో నిర్మాణ రంగం కీలక పాత్రపై ప్రశంసలు
- రాష్ట్ర వ్యాప్తంగా లక్ష కోట్ల విలువైన పనులు
- ప్రతి జిల్లాలో పనుల ఫలితం కనిపించేలా చర్యలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ మీటింగ్ 2025-26 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి

..మిగతా 2లో

# ఫ్లై ఓవర్ల పనులు ప్రారంభం

- కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లై ఓవర్లు
- మరో ఏడు అండర్ పాస్‌ల నిర్మాణం
- రూ.1000 కోట్ల వ్యయంతో పనులు
- రెండు దశల్లో పూర్తి నిర్మాణాలు
- నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్

**హైదరాబాద్, (డిడి9 వార్త):** హైదరాబాద్ మహా నగరంలోని కాసు బ్రహ్మానంద రెడ్డి నేషనల్ పార్క్ (కేబీఆర్ పార్క్) పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు

..మిగతా 3లో





# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ

- మహిళల ఆరోగ్యరక్షణకు కేంద్రం ముందడుగు
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ను అరికట్టడమే లక్ష్యం
- ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా వాక్సినేషన్
- టైప్ 16, 18, 6, 11 రకాల నుంచి రక్షణ
- దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్యక్రమం
- చిన్న వయసులోనే ఇమ్యూనిటీ పెంపు

02

# కమిషన్ రిపోర్టును మూసీలో వేయండి

- అర్బన్ నక్సల్స్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువ ఏముంది?
- చాక్ పీసులకు పైసలు లేని స్కూళ్లకు పరిష్కార మార్గమేది?
- ఉపాధ్యాయులను అవమానించిన విద్యా కమిషన్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



# కమిషన్ రిపోర్టును మూసీలో వేయండి



- అర్బన్ నక్సల్స్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువ ఏముంది?
- చాక్ పీసులకు పైసలు లేని స్కూళ్లకు పరిష్కార మార్గమేది?
- ఉపాధ్యాయులను అవమానించిన విద్యా కమిషన్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

విద్యా రంగ అభివృద్ధి కోసం అవసరమైన సిఫార్సులు చేయకుండా ఉపాధ్యాయుల జీతాలు తగ్గించాలంటూ విద్యా కమిషన్ నివేదిక ఇవ్వడం సిగ్గు చేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. విద్యా కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన వ్యక్తులకే నైతికత లేదని, ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా ఏసీ గదుల్లో కూర్చుని రూపొందించిన నివేదిక అని మండిపడ్డారు. అలాంటి రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని, ఒక రకంగా చెత్తబుట్ట కూడా అవమానకరంగా భావించే నివేదిక అని, తీసుకెళ్లి మూసీలో విసిరేయండంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసి అవమానించేలా నివేదిక ఇచ్చారని అన్నారు. ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచాలని చేసిన సిఫార్సులను అమలు చేస్తే పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా విద్యార్థులంతా ఇకపై స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆకునూరి మురళి అర్బన్ నక్సల్**

తెలంగాణలో విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని, గత ప్రభుత్వంలోనూ స్కావెంజర్లు లేరని, పేద విద్యార్థుల ఆశలు కలగానే మిగిలిపోతున్నాయని బండి సంజయ్ అన్నారు. విద్యా శాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుతం స్కూళ్లు ఉన్న చోట టీచర్లు లేరని, టీచర్లు ఉన్న చోట విద్యార్థులు లేరని, అందరూ ఉన్న చోట కనీస సదుపాయాలు లేవని, అందుకే డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. విద్యా రంగం సమస్యలతో సతమతమవుతుంటే మెరుగు పర్చాలనే సోయి లేకుండా విద్యా కమిషన్ పూర్తి భిన్నంగా నివేదిక ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తున్నదని చురకలంటించారు. ప్రపంచంలో ఆదర్శవంతమైన విద్యను అందిస్తున్న దేశం ఫిన్ ల్యాండ్ అని, ఆ దేశంలో ఉపాధ్యాయులకు, ప్రొఫెసర్లకు మాత్రమే అత్యధిక జీతాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా ఉపాధ్యాయుల జీతాలను తగ్గించాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వాళ్లంతా పేద పిల్లలేనని, 35 మార్కులొస్తే పాసయ్యే అవకాశముందని, కానీ ఆకునూరి మురళి కమిషన్ మాత్రం 45 మార్కులకు పెంచాలని సిఫార్సు చేయడం దుర్మార్గమైనదిగా పేర్కొన్నారు. ఆకునూరి మురళిది అర్బన్ నక్సల్ భావజాలమని, ఆయన ఆధ్వర్యంలో కమిషన్ వేయడాన్ని బండి సంజయ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నివేదిక తెప్పించుకుని ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు.

**అక్రమ వలసలపై వినతి**

రంగారెడ్డి జిల్లాలో బంగ్లాదేశ్, రోహింగ్యా ముస్లిం అక్రమ వలసదారులను గుర్తించి వారిని ఆయా దేశాలకు పంపేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆయా రోహింగ్యాలు, వలసదారులంతా దేశ రక్షణ సంస్థలున్న పరిసరాల్లో నివాసం ఉంటున్నాయని, దీనివల్ల దేశ భద్రతకు పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు భాగ్యనగర్ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవ రెడ్డి, రావినూతల శశిధర్ సహా పలువురు నేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**



దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించింది. శనివారం రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ జాతీయ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల్లో అధికంగా కనిపిస్తున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు హెచ్‌పీవీ వైరస్ వల్ల కలిగే మరికొన్ని క్యాన్సర్లను ముందుగానే అరికట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వెల్లడించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే హెచ్‌పీవీ టీకాను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ వైరస్‌లో ప్రమాదకరంగా భావించే టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పిస్తుందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసుల్లో అధిక శాతం ఈ వైరస్ కారణంగానే సంభవిస్తున్నందున ముందస్తు రక్షణ చర్యగా టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సుల మేరకు గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న వ్యూహంలో భాగంగానే భారత్ కూడా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి సంవత్సరం సుమారు 1.15 కోట్ల డోసులను పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అన్ని ప్రభుత్వ వైద్యసంస్థల్లో ఈ టీకాను అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్ మొదటగా 2006లో అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 50 కోట్లకు పైగా డోసులు పంపిణీ చేసినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ టీకా అమలు చేసిన పలు దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు గణనీయంగా తగ్గినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోని 160కు పైగా దేశాల్లో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం కొనసాగుతుండగా, వాటిలో సుమారు 90 దేశాలు సింగిల్ డోస్ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

భారత్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు అంచనా. 2040 నాటికి దేశంలో ప్రతి ఏడాది కొత్తగా నమోదయ్యే క్యాన్సర్ కేసులు 20 లక్షలకు చేరే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా, వీరిలో దాదాపు 15 లక్షల మంది భారతీయులే ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

మహిళల్లో నివారించదగిన క్యాన్సర్లను తగ్గించడం, చిన్న వయస్సులోనే రోగ నిరోధక శక్తిని పెంచడం, భవిష్యత్తులో క్యాన్సర్ భారాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ జాతీయ హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# వ్యక్తిగతంగా పరిశీలిస్తా..

**మొదటిపేజీ తరువాయి**

సీఎం స్పందించారు. సౌదీ ప్రమాద బాధితులకు సాయం అందించారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం నాంపల్లి కోర్టుకు కూడా హాజరయ్యారు.

**99 రోజుల కార్యాచరణపై సమీక్ష**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు స్థితిపై విపులంగా సమీక్షించారు. ప్రతి శాఖ తన పనితీరుపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రకటించిన కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా నేలమీద ఫలితాలు కనపడాలని స్పష్టం చేశారు. సమావేశంలో ముఖ్యంగా కోకాపేటలోని శారదాపీఠం భూముల అంశంపై సీఎం ఆరా తీశారు. ఆ భూముల కేటాయింపులపై సరైన సమాచారం అందించలేదని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆ భూములను శారదాపీఠానికే కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇంతకుముందు జలమండలికి చేసిన కేటాయింపులను రద్దు చేశారు. సంబంధిత వివరాలపై మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమై పూర్తి వివరాలు ఇవ్వాలని పీఠం ప్రతినిధులకు సూచించారు.

**భూముల కేటాయింపుపై నేపథ్యం**

తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2019లో అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ పరిధిలో విశాఖ శ్రీశారదా పీఠానికి సుమారు రెండున్నర ఎకరాల భూమిని కేటాయించింది. ఆ సమయంలో విలువైన ప్రభుత్వ భూమిని తక్కువ ధరకు కేటాయించడంపై రాజకీయంగా చర్చలు జరిగాయి. ఆ భూమిని ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల కోసం వినియోగిస్తామని పీఠం పేర్కొంది. తాజా పరిణామాలతో ఆ అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది.

**కాకినాడ పేలుడు ఘటనపై స్పందన**

ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 21 మంది కార్మికులు మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.

**సౌదీ బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా**

గత ఏడాది నవంబర్ 17న సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన హైదరాబాద్‌కు చెందిన 44 మంది కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేశారు. ప్రమాదంలో గాయపడిన ఒక బాధితుడికి రూ. 3 లక్షల సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సాధారణంగా విదేశాల్లో జరిగే ప్రమాదాలకు రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం ఇవ్వవని గుర్తుచేశారు. అయితే ఈ ఘటన తీవ్ర విషాదకరమని, బాధిత కుటుంబాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేబినెట్ ప్రత్యేకంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజల కష్టసుఖాల్లో తోడుంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టామని,



మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ను మదీనాకు పంపినట్లు సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం**

శనివారం సీఎం రేవంత్ రెడ్డి నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. గతంలో నమోదైన రెండు వేర్వేరు కేసుల విచారణ నేపథ్యంలో ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై న్యాయ ప్రక్రియలో పాల్గొన్నారు. మొదటి కేసు 2021లో కోవిడ్ నిబంధనలు అమల్లో ఉన్న సమయంలో జరిగిన పబ్లిక్ మీటింగ్‌కు సంబంధించినది. ప్రభుత్వం విధించిన పరిమితులను ఉల్లంఘించి సభలో పాల్గొన్నారన్న ఆరోపణలపై కేసు నమోదైంది. రెండో కేసు 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించినది. అనుమతుల పరిమితులను అతిక్రమించి ర్యాలీ నిర్వహించారన్న ఆరోపణలపై అప్పట్లో కేసు నమోదు చేశారు. ఆ కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కోర్టుకు హాజరైనట్లు సమాచారం. చట్ట ప్రక్రియకు గౌరవం ఇస్తూ న్యాయస్థానానికి హాజరైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి.

**పరిపాలన, బాధ్యతలపై స్పష్టమైన సంకేతం**

సచివాలయ సమీక్షల నుంచి కోర్టు హాజరు వరకు జరిగిన పరిణామాలు ప్రభుత్వం పరిపాలనపై దృష్టి కేంద్రీకరించిందనే సంకేతాలు ఇస్తున్నాయి. 99 రోజుల కార్యాచరణ అమలు, వివాదాస్పద భూముల అంశంపై నిర్ణయం, బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ఈ నిర్ణయాలు ప్రజలకు అండగా నిలవాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని సూచిస్తున్నాయి. మొత్తానికి, ఒకేరోజు పలు కీలక అంశాలపై తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ రాజకీయ వాతావరణం చురుగ్గా మారింది. అభివృద్ధి, పరిపాలన, సామాజిక బాధ్యత అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రదర్శించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మౌలిక వసతులే అభివృద్ధికి పునాది

**మొదటిపేజీ తరువాయి**



కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాణ రంగానికి చెందిన ప్రముఖులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, పరిశ్రమ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో నిర్మాణ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినా, వాటిని కార్యరూపం దాల్చేది నిర్మాణ రంగమేనని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుంది. ప్రాజెక్టులు ప్రకటిస్తుంది. కానీ వాటికి జీవం పోసేది మీరు చేసే పనులే. మీరు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. మీరు కట్టే వంతెనలు దూరాలను తగ్గిస్తాయి. మీరు నిర్మించే భవనాలు సేవల కేంద్రాలుగా మారతాయి. అందుకే నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టులు కాదు, అది రాష్ట్ర నిర్మాణం" అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. మౌలిక వసతులు బలంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు సరిగా లేకపోతే పరిశ్రమలు రాకపోవచ్చని, కనెక్టివిటీ బాగుంటేనే కొత్త అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. అందుకే రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) ద్వారా చేపడుతున్న రహదారి ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్, జాతీయ రహదారుల విస్తరణ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, ఫ్లైఓవర్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు వంటి అనేక పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలోనూ అభివృద్ధి పనులు కనిపించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్ట్ అని మంత్రి అభివర్ణించారు. ఇది హైదరాబాద్ నగరంపై ఉన్న ట్రాఫిక్ భారాన్ని తగ్గించడమే కాకుండా చుట్టుపక్కల జిల్లాల్లో కొత్త అభివృద్ధి అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలుతో కొత్త పరిశ్రమలు, లాజిస్టిక్స్ హబ్‌లు, వాణిజ్య కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇది ఆర్థిక కారిడార్ల అభివృద్ధికి దారి తీస్తుందని పేర్కొన్నారు.

నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని మంత్రి అన్నారు. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వం మరియు నిర్మాణ రంగం పరస్పర సహకారంతో పనిచేస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో భాగస్వామ్యంగా ముందుకు సాగాలని బిల్డర్లకు పిలుపునిచ్చారు. నిర్మాణాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెంచాలని మంత్రి సూచించారు. సమయపాలన, నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రజల పన్నుల డబ్బుతో చేపడుతున్న ప్రాజెక్టులు కావడంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. పనులు ఆలస్యం కాకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. రాబోయే దశాబ్దాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, వంతెనలు, భవనాలు నిర్మించాలని తెలిపారు. కేవలం ప్రస్తుత అవసరాలకే పరిమితం కాకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులను అమలు చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు బిల్డర్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనుమతుల ప్రక్రియలను సరళీకృతం చేయాలని, చెల్లింపులు సమయానికి జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమావేశం ముగింపులో నిర్మాణ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాబోయే కాలంలో చేపట్టనున్న ప్రాజెక్టులపై అవగాహన కల్పించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ఈ సమావేశం నిర్మాణ రంగం మరియు ప్రభుత్వ మధ్య సమన్వయాన్ని మరింత బలపరిచే వేదికగా నిలిచింది. మౌలిక వసతుల అభివృద్ధిని కేంద్ర బిందువుగా చేసుకుని తెలంగాణను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి స్పష్టంగా తెలియజేశారు.

# దేవుడి మాన్యాలపై ప్రభుత్వం కన్ను

- కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం అంటే గుళ్లు, గోపురాలు కూల్చడమేనా?
- శారదా పీఠం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం శుభపరిణామం
- ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా చేపట్టే చర్యలపై పోరాడుతూనే ఉంటాం
- మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని శనివారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు కాంగ్రెస్ పాలన తయారైందని అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని ఆరోపించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి కోటి 5 లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని తెలిపారు. హెచ్ఎండీఏకు రూ.23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారన్నారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ట కార్యక్రమం జరిగిందని, అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయని హరీశ్ రావు వివరించారు. వాటర్ వర్క్స్ హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ కోసం ఈ స్థలం తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నదని, ఆలయానికి అవతలే సర్వే నెంబర్ 239, 240లలో 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని తెలిపారు. అలా కాకుండా శారదా పీఠం జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే ధర్మమా అని ప్రశ్నించారు. ఉదయం తాను ఇక్కడికి వస్తున్నానని తెలియగానే పోలీసులు, ఆర్ఐ, తహసీల్దార్ అందరూ పారిపోయారని అన్నారు. దొంగల్లా దాక్కోవాల్సిన అవసరం పోలీసులకు ఏమొచ్చిందని అడిగారు. ఉదయం స్వాములు పూజలు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని, దేవాలయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న పూజలను ఆపే హక్కు, ధైర్యం ఎవరిచ్చారని ప్రశ్నించారు.

**రద్దు నిర్ణయం మంచిది**

మరోవైపు, శారదా పీఠం భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక హరీశ్ రావు స్పందించారు. ఆ భూములను పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామమని, కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజశ్యామలా దేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయంగా పేర్కొన్నారు. ఇది భక్తుల విజయం అన్నారు. ఎలాంటి స్పష్టమైన ప్రజా ప్రయోజన ప్రతిపాదిక లేకుండా, పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ, నామినేషన్ పద్ధతిలో హెచ్ఎండిఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకునే ప్రభుత్వం చర్యలపై బీఆర్ఎస్ గట్టిగా పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.



# కాకినాడలో మహా విషాదం..!





**మొదటిపేజీ తరువాయి**

దూరం వరకు వినిపించినట్లు సమాచారం. సమీప గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాల భవనం స్లాబ్‌కు కూడా పగుళ్లు వచ్చినట్లు తెలిసింది.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకున్నారు. గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు ప్రాంతాన్ని చుట్టుముట్టి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీప ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలపై ప్రాథమికంగా పరిశీలన చేపట్టారు. బాణసంచా తయారీ సమయంలో భద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడు సంభవించిన గోదాములో భారీగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు సమాచారం.ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను కలచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందిస్తామని చెప్పారు.

ఇక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లాలో పర్యటనలో ఉన్న సమయంలో ఈ విషాద వార్త అందింది. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సహాయక చర్యలు వేగంగా కొనసాగించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను తక్షణమే ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని నిశితంగా గమనించాలని వైద్య అధికారులకు చెప్పారు.

మృతుల్లో ఇప్పటివరకు 11 మందిని అధికారులు గుర్తించారు. అడబాల శ్రీను, మందపల్లి చిన్ని, కడింపల్లి కృపమ్మ, సాధనాల సత్యవేణి, కడింపల్లి ధనరాజు, నిమ్మాడ కరుణ, వట్లూరి రవి, గొడతా నాని, గంపల మంగ, గొడతా రాము, గొడతా మహేశ్ పేర్లు వెల్లడయ్యాయి. మరికొందరి గుర్తింపునకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు.ఈ బాణసంచా కేంద్ర యజమాని అడబాల వీరబాబు తండ్రి శ్రీను కూడా ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. బాధిత కుటుంబాల ఇళ్ల వద్ద శోకసంద్రం కనిపిస్తోంది.

స్థానికులు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా సరైన పర్యవేక్షణ లేకపోవడమే కారణమని అంటున్నారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పేలుడు ఎలా జరిగింది? భద్రతా చర్యలు పాటించారా లేదా? అనుమతులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. పేలుడు జరిగిన సమయంలో గోదాములో ఎంతమంది పనిచేస్తున్నారు? పేలుడు పదార్థాలు ఎంతమేర నిల్వ ఉంచారు? వంటి వివరాలను సేకరిస్తున్నారు.

ఈ ప్రమాదం మరోసారి బాణసంచా పరిశ్రమల్లో భద్రతా లోపాలపై ప్రశ్నలు లేవనెత్తింది. కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వకుండా లాభాల కోసమే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మికుల భద్రత కోసం కఠిన నియమాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఒక్కసారిగా సంభవించిన ఈ విస్ఫోటనం పలు కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచింది. రోజువారీ కూలీ పనికి వెళ్లిన వారు ఇకపై తిరిగి రారని తెలిసి వారి కుటుంబాలు విలపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించే సహాయం ఎంతైనా, కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా సంతాపం వ్యక్తమవుతోంది. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఆర్థిక సాయం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పై ఒత్తిడి పెరుగుతోంది. సామర్లకోట సమీపంలో జరిగిన ఈ భారీ పేలుడు ఘటన జిల్లాను కుదిపేసింది. నిర్లక్ష్యం, భద్రతా లోపాలు కలిసొచ్చినప్పుడు ఎంతటి విషాదం సంభవిస్తుందో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు అందరి దృష్టిలో ఉంది.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకరదాడి

- **ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు**
- **అనేక ప్రాంతాల్లో అలుముకున్న దట్టమైన పొగ**
- **- ఇరాన్ నుంచి ప్రతిదాడులు జరిగే అవకాశం**
- **ఇజ్రాయెల్ లో హై అలర్ట్.. స్కూళ్లు, దుకాణాలు బంద్**
- **ఈ దాడుల వెనుక అమెరికా ఉందా?**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

అణు ఒప్పందంపై అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు దిగడంతో ప్రాంతీయ పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. పేలుళ్ల అనంతరం నగరంలోని అనేక ప్రాంతాల్లో దట్టమైన పొగ వ్యాపించగా, ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

క్షిపణి దాడులు.. ఇజ్రాయెల్ అధికారిక ప్రకటన దాడులకు తామే బాధ్యులమని ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. శత్రుదేశం నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పును ముందుగానే నిర్వీర్యం చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ భద్రతే ప్రధాన లక్ష్యమని, అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు.

**దేశవ్యాప్తంగా అప్రమత్తత – ఎమర్జెన్సీ ప్రకటన**

దాడుల అనంతరం ఇజ్రాయెల్ సైన్యం దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. ప్రతిదాడుల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ప్రకటించారు. ప్రధాన నగరం టెల్‌అవీవ్తో పాటు పలు ప్రాంతాల్లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగించగా, ప్రజలను భద్రతా ఆశ్రయ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా స్కూళ్లు, కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**అమెరికా పాత్రపై అంతర్జాతీయ చర్చ**

ఈ దాడుల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలు పరోక్ష సహకారం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను చేపట్టిందన్న వార్తలు వెలువడుతున్నప్పటికీ, అధికారికంగా స్పష్టమైన ధృవీకరణ మాత్రం వెలువడలేదు. అణు ఒప్పందంపై ఇప్పటికే అమెరికా-ఇరాన్ మధ్య తీవ్ర విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం మరింత ఉద్రిక్తతలకు దారితీసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**గగనతలం మూసివేత – విమాన రాకపోకలపై ప్రభావం**

భద్రతా కారణాలతో ఇజ్రాయెల్ తన గగనతలాన్ని పౌర విమానాలకు తాత్కాలికంగా మూసివేసింది. అంతర్జాతీయ విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఇరాన్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రభావం పడినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోవడంతో సమాచార మార్పిడి అంతరాయం ఏర్పడింది.

**ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం**

తాజా పరిణామాలతో మధ్యప్రాచ్య ప్రాంతంలో యుద్ధ వాతావరణం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరాన్ నుంచి ప్రతిదాడులు జరిగే అవకాశంపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అణు ఒప్పంద వివాదాలు, భద్రతా ఆందోళనలు, ప్రాంతీయ శక్తుల మధ్య పెరుగుతున్న విభేదాలు కలిసివచ్చి పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయని దౌత్య వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఫ్లై ఓవర్ల పనులు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం భారీ ప్రణాళికను అమలు చేయడానికి ముందుకొచ్చింది. పార్క్ చుట్టూ మొత్తం ఏడు ఫ్లై ఓవర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టారు. హెచ్‌సిటీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. సుమారు రూ. 1000 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులు రెండున్నర ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**రెండు దశల్లో నిర్మాణం**

ఈ భారీ ప్రాజెక్టును రెండు భాగాలుగా విభజించారు. ప్రాజెక్టు-1లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఫ్లైఓవర్ మరియు అండర్‌పాస్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే కేబీఆర్ పార్క్ జంక్షన్ పూర్తిగా సిగ్నల్ ఫ్రీగా మారనుంది. దీంతో ఈ ప్రాంతంలో తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ జామ్ సమస్య గణనీయంగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

సాగర్ సొసైటీ వద్ద కూడా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇది పూర్తయితే ఆ జంక్షన్‌లో కూడా సిగ్నల్ అవసరం లేకుండా వాహనాలు సాఫీగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. రోజుకు వేల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నందున ఈ మార్పులు కీలకమని ట్రాఫిక్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు-2లో భాగంగా క్యాన్సర్ హాస్పిటల్ నుంచి అగ్రసేన్ మహారాజ్ జంక్షన్, రోడ్డు నెంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఈ మొత్తం నిర్మాణం పూర్తయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ప్రధాన కూడళ్లన్నీ సిగ్నల్ ఫ్రీ జోన్‌గా మారతాయి.

**ఇప్పటికే ప్రారంభమైన పనులు**

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రారంభ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ముఖ్యంగా పిల్లర్ల నిర్మాణం వేగంగా చేపట్టాలని నిర్ణయించారు. రెండున్నర నెలల వ్యవధిలో పిల్లర్ల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ఇంజనీరింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు కలిసి ప్రదేశాలను పరిశీలించి పనుల ప్రణాళికను ఖరారు చేశారు. కేబీఆర్ పార్క్ నుంచి సాగర్ సొసైటీ వరకు అవసరాన్ని బట్టి రెండు వైపులా సింగిల్ రోడ్ విధానంలో వాహనాల రాకపోకలు కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు ఇబ్బంది తక్కువగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి**

నిర్మాణ పనుల కారణంగా కొన్ని మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ (గేట్-1), ముగ్ధ జంక్షన్ ప్రాంతాల్లో ప్రధానంగా మార్పులు చోటుచేసుకున్నాయి. వాహనదారులు ముందుగానే మార్గాలను తెలుసుకుని ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.


బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లేవారు రోడ్ నెంబర్-10, క్యాన్సర్ హాస్పిటల్, అగ్రసేన్ ఐలాండ్, భారతీయ విద్యా భవన్ మార్గంగా వెళ్లాలి.

మాసాబ్ ట్యాంక్ నుంచి కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనాలు విరించి హాస్పిటల్ రోడ్ నెంబర్-12 జంక్షన్ వద్ద ఎడమవైపు తిరిగి అగ్రసేన్ ఐలాండ్ మార్గాన్ని ఉపయోగించాలి.

ఎన్‌ఎఫ్‌సీఎల్ నుంచి శ్రీనగర్ కాలనీ, సాగర్ సొసైటీ, ఇందిరానగర్, లేబర్ అడ్డా మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు వెళ్లేలా మార్గం నిర్దేశించారు.

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36/45 నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ వైపు వెళ్లేవారు ఇందిరానగర్, శ్రీరామ్ నగర్ కాలనీ మార్గాన్ని ఉపయోగించాలి.

ఈ మార్గమార్పులపై స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులకు సూచనలు ఇస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది కీలక కూడళ్ల వద్ద విధుల్లో ఉండి మార్గనిర్దేశం చేస్తున్నారు.



**లక్ష్యం.. సిగ్నల్ ఫ్రీ సర్కిల్**

ప్రస్తుతం కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కూడళ్లలో పీక్ అవర్స్ సమయంలో భారీగా ట్రాఫిక్ నిలుస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు గంటల తరబడి ఇరుక్కుంటున్నారు. ఈ సమస్యను పూర్తిగా తొలగించేందుకు సిగ్నల్ ఫ్రీ సర్కిల్‌గా మార్చడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు పూర్తయితే వాహనాలు ఎక్కడా ఆగకుండా సాగిపోతాయి. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. కాలుష్యం కూడా కొంతవరకు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**ప్రజలకు సూచనలు**

నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో కొంత ఇబ్బంది తప్పదని అధికారులు స్పష్టం చేశారు. అయితే దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. అవసరం లేకపోతే ఆ ప్రాంతాలను తప్పించుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచించారు. అలాగే రష్ అవర్స్‌లో ప్రయాణాలను తగ్గించడం, కార్‌పూలింగ్ చేయడం వంటి మార్గాలను కూడా పరిశీలించాలని ట్రాఫిక్ అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

**భారీ ప్రాజెక్టుతో నగర రూపు మార్పు**

ఈ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతం పూర్తిగా కొత్త రూపు సంతరించుకోనుంది. నగర అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. రెండున్నర ఏళ్లలో నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తానికి, ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు చేపట్టిన ఈ భారీ ప్రణాళిక నగర వాసులకు భవిష్యత్తులో ఉపశమనం కలిగించనుంది. ప్రస్తుతం కొంత ఇబ్బంది ఉన్నా, పూర్తయిన తర్వాత ప్రయాణం సులభంగా, వేగంగా మారుతుందని అధికారులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు సహకరించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలలలో ఘనంగా జాతీయ విజ్ఞాన (సైన్స్ )దినోత్సవం

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ :( డిడి 9 వార్త )**

బోథ్ మండల కేంద్రం లోని స్థానిక ప్రభుత్వ పాఠశాల, వేదం పాఠశాల,నాగభూషణం పాఠశాలలలోజాతీయవిజ్ఞాన(సైన్స్ )దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు . పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ కార్యక్రమాన్ని ప్రారంభించి సర్ సి వి రామన్ సేవలను స్మరించు కొని , సైన్స్ యొక్క ,ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్ మరియు ఎంపీడీవో రమేష్, పోలీస్ అధికారి పురుషోత్తం విచ్చేశారు వారికి ప్రధానోపాధ్యాయులు పుష్ప గుచ్చాలు సమర్పించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు ఇచ్చిన ఉపన్యాసాలు మరియు పాడిన పాటలు అందరిని అలరించాయి .ఇందులో భాగంగా తహసీల్దార్ మరియు ఎంపీడీవో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించి విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను తిలకించి వారు వాటి గురించి తెలియజేసిన విధానాన్ని కొనియాడారు. విద్యార్థులు ప్రదర్శించిన రంగురంగుల సైన్స్ నమూనాలు అందరినీ ఆకర్షించాయి. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి ,GSLV .MK lll, రోబోటిక్ సిటీ వ్యవసాయ సాంకేతికత, వర్షపు నీటి నిల్వ పద్ధతులు ,ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# కీస్టోన్ కంపెనీ నిర్లక్ష్యంపై అక్బర్ నగర్‌లో రాస్తారోకో

- **రోడ్డు ప్రమాదాలకు కంపెనీ, ఆర్అండ్‌బి అధికారులు బాధ్యులంటూ గ్రామస్తుల ఆగ్రహం**

**రుద్రూర్, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

అక్బర్ నగర్ గ్రామ ప్రజలు కీస్టోన్ కంపెనీ నిర్లక్ష్య తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామంలోని ఫుడ్ టెక్నాలజీ కళాశాల ఎదుట రాత్రిపూట పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ నిరసన కార్యక్రమం కారణంగా రుద్రూర్-అక్బర్ నగర్ ప్రధాన రహదారిపై రాకపోకలు స్థంభించాయి. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, కీస్టోన్ కంపెనీ రోడ్డు పనుల పేరుతో మూలమలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా మొరం కుప్పలు వేసిందని తెలిపారు. ఫారం గేటు నుంచి ఫుడ్ టెక్నాలజీ కళాశాల వరకు ఉన్న ప్రమాదకర మూలమలుపు వద్ద ఈ మొరం కుప్పల కారణంగా ఇప్పటికే సుమారు ఎనిమిది మంది రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వెంకటేశ్వర ఆలయ సమీపంలో కూడా ఓ వ్యక్తి ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటనను గుర్తు చేశారు.రోడ్డు పనులు నిర్వహిస్తున్న సమయంలో నీరు చల్లకపోవడంతో దుమ్ము ఎక్కువగా ఎగసి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇది కూడా ప్రమాదాలకు కారణమవుతోందని గ్రామస్తులు ఆరోపించారు. కంపెనీ సూపర్వైజర్ ఖాద్రీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పక్షపాత ధోరణి అవలంబిస్తూ ప్రజల భద్రతను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.కీస్టోన్ కంపెనీ నిర్వాహకులతో పాటు ఆర్ అండ్ బి అధికారులపై కేసులు నమోదు చేయాలని, వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ఘటనాస్థలానికి వచ్చి సమాధానం చెప్పే వరకు రాస్తారోకో విరమించబోమని వారు స్పష్టం చేశారు.



సమాచారం అందుకున్న రుద్రూర్ ఎస్సై సాయన్న పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం కీస్టోన్ కంపెనీ ప్రతినిధులను పిలిపించి రోడ్డుపై ఉన్న మొరం కుప్పలను వెంటనే తొలగించేలా ఆదేశించారు. కంపెనీ సిబ్బంది వాటిని తొలగించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చి గ్రామస్తులు నిరసన విరమించారు.అయితే భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చ



## నేషనల్ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ

**బీర్కూర్, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

బీర్కూర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర కళాశాల లో శనివారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశంతో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ శాస్త్రీయ నమూనాలు, ప్రాజెక్టులు ప్రదర్శించి తమ సృజనాత్మకతను, ప్రతిభను చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు, సౌరశక్తి వినియోగం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా మండల విద్యా అధికారి వెంకన్న ప్రత్యేకంగా హాజరై ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. శాస్త్ర విజ్ఞానం జీవితంలో ఎంత ముఖ్యమో వివరించి, భవిష్యత్తులో మరింత శ్రమించి ఉన్నత స్థానాలు సాధించాలని ప్రోత్సహించారు.పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించే దిశగా ఈ సైన్స్ ఎగ్జిబిషన్ మంచి వేదికగా నిలిచింది.



## ఘనంగా శబరి మాత ఆశ్రమ వార్షిక ఉత్సాహం.

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 28 (డిడి9న్యూస్ ):-**



ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలోని శ్రీ శబరి మాత ఆశ్రమం 19 వ వార్షికోత్సాహం శనివారం రోజు ఆమె భక్త బృందం ఘనంగా నిర్వహించారు.శుక్రవారం రాత్రి నుంచే ఆశ్రమ ప్రాంగణం మొత్తం శ్రీరామనామ స్మరణతో మారు మ్రోగింది.శనివారం ఉదయం నుంచే ఆశ్రమంలో శబరిమాత శిష్యులుఅంతాగుమిగూడి ఆశ్రమం శుభ్రంచేసి,ముగ్గులువేసిసుందరంగాఅలంకరణలుచేశారు.అనంతరంధ్వజారోహణకార్యక్రమం, జ్యోతి ప్రజ్వలన చేసి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. శబరి మాత విగ్రహంకు పూజలు చేసి భక్తి చాటుకున్నారు. భజన బృందం భక్తి శ్రద్ధలతో పాటలు పాడగ అధ్యాత్మిక చింతనతో, జనాల తాకిడితో సందడి నెలకొంది.పూజపూర్తి అయిన పిదపవచ్చిన గ్రామస్తులకు అన్న ప్రసాదవితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంఅధ్యాంతం భజనతో భక్తితో వెలుగొందిందింది. కొంతమందిదంపతులుయజ్ఞంకార్యక్రమంలో పాల్గొన్నారు.



## మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

- **డీఏఓకు వినతి పత్రం అందజేత**

**బాన్సువాడ, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

మేరు కులస్తుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బాన్సువాడ మేరు సంఘం సభ్యులు శనివారం డీఏఓను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాన్సువాడ మేరు సంఘం అధ్యక్షులు వి.టూరి హనుమాన్లు మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమ కులస్తులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వర్తించే అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.కులవృత్తిగా దర్జీ పనిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలల సంక్షేమ హాస్టళ్లలో మరియు ఇతర ప్రభుత్వ శాఖల్లో యూనిఫామ్ కుట్టే పనులను మేరు కులస్తులకు మాత్రమే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా నూతన సాంకేతికతతో వచ్చిన జూకీ మిషన్లను సబ్సిడీపై అందించాలని కోరారు.అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి కార్మికునికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను నేరుగా మంజూరు చేసి, వాటిపై 80 శాతం సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ మేరు సంఘం ఉపాధ్యక్షులు కొట్టూరు మహేష్, రుద్రంగి మహేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సిలాంకోటి మహేష్, సభ్యులు కొట్టూరు సురేష్, నందు, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ విద్యా విధానం 2026 ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు

- **బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బిటీఎఫ్).**
- **విద్యార్థుల భవిష్యత్తుకు సమాధి!**

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 28 (డిడి9న్యూస్ ):-**

తెలంగాణా విద్యా వ్యవస్థపై విద్యా కమిషన్ రూపొందించిన ఎడ్యుకేషన్ పాలసీ సర్జికల్ స్ట్రైక్ చేయడమే అవుతుందని బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గడుగు మహేందర్ ప్రభుత్వాన్ని విద్యా పాలసీ సిఫారసులను పునఃపరిశీలన చెయ్యాలని కోరారు.ఈసందర్భంగా బజార్ హత్నూర్లో ఉపాధ్యాయ వర్గంతో శనివారం రోజు సమస్యపై చర్చించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ విద్యా కమిషన్ (ఆకునూరి మురళి కమిటీ) సమర్పించిన నివేదికను తప్పు పడుతూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు . ఈ నివేదిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్ర చేస్తోంది,తప్ప మరొకటికాదని,విద్యా వ్యవస్థను కాపాడాల్సిన కమిషనే,ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం శోచనీయమని అన్నారు.

**విద్యాహక్కుచట్టంఖూనీ:-**

మూడు గ్రామాలకు ఒకే బడి' అంటే అర్థం ఏమిటి? పేద బిడ్డలను బడికి దూరం చేయడమే కదా? ఆర్ టి ఈ 2009 స్ఫూర్తినితుంగలో తొక్కే హక్కు ఈ కమిషన్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు? ఉపాధ్యాయుల శ్రమకు వెల కడతారా? బజార్ విలువలతో ఉపాధ్యాయుల వేతనాలను పోల్చడంతో ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుంటోందని విమర్శలు చేశారు.విద్యానాణ్యత పెరగాలంటే నియామకాలు జరగాలి. కానీ, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ విధానంతో వ్యవస్థను బానిసత్వంలోకి నెట్టకూడదని తెలిపారు.

**పదోన్నతులపై గొడ్డలి పెట్టు:-**

ఉపాధ్యాయులకు పదోన్నతులు సీనియారిటీ ద్వారా కాకుండా పారామీటర్ల ద్వారా ఇవ్వాలనడం అర్థరహితం, సర్వీస్ రూల్స్ కు పూర్తి గా వ్యతిరేకం. దశాబ్దాల తరబడి సర్వీసులో ఉండి, హెడ్ మాస్టర్లుగాపదోన్నతి పొందాలని ఎదురు చూస్తున్న స్కూల్ అసిస్టెంట్ల ఆశలపై నీళ్ల




చల్లి,100% నేరుగా భర్తీ ప్రతిపాదన ఇది ముమ్మాటికీ ఉపాధ్యాయ వర్గానికినష్టమే!

**ఆర్థిక అణచివేత ఏ ఏ ఎస్:-**

6/12/18/24 ఏళ్ల స్కేళ్లను బడ్జెట్ భారంగా చూడటం దుర్మార్గం. మానసిక వేధింపులు, పనివేళల పేరుతో, నివాస పరిమితుల పేరుతో ఉపాధ్యాయులను కట్టడి చేయాలనుకోవడం అప్రజాస్వామికం. సాయంత్రం 6:30 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించాలనడం, ఉపాధ్యాయులు పనిచేసే గ్రామం లేదా 15 కి.మీ పరిధిలోనే నివాసంఉండాలన్న నిబంధనల వలన నాణ్యత పెరగదన్నారు.మౌలిక వసతులు లేని బడుల్లో ఒత్తిడి పెంచితే నాణ్యమైన విద్యను ఎలా అందిస్తారని ప్రశ్నించారు.ప్రభుత్వ కార్యాలయాల ప్రతిపాదన అనవసరమైన వివాదాలకు దారి తీస్తుంది."విద్యా కమిషన్ నివేదికను ప్రభుత్వం తక్షణమే బుట్టదాఖలు చేయాలి అని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తే ఊరుకునే ప్రసక్తే లేదని,బడుల బలోపేతం, ఉపాధ్యాయుల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా మొండిగా ముందుకెళ్తే బి టీ ఎఫ్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.



## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ

**బీర్కూరు, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

బీర్కూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. షేఖ్ బీజాన్ బీ భర్త ముక్తర్కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా బీర్కూర్ సర్పంచి అరిగే ధర్మతేజ, ఉపసర్పంచ్ పరమేష్ పంతులు, పంచాయతీ కార్యదర్శి భూమి పూజ నిర్వహించారు. పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగారాం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు యమ చిన్న రాములు, సయ్యద్ రఫీ, వార్డు సభ్యులు సదర్ కాజా, ఆనంద్, నవీన్, రాహుల్, మహేష్, భాస్కర్, రఘు, కుర్రి కృష్ణ, రాజు, మహమూద్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు

**బజార్ హత్నూర్,ఫిబ్రవరి 28,(డిడి9న్యూస్ )**




తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలుబంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో వాతావరణంమారుతుందని పేర్కొంది. ఉత్తరకోస్తా,ఆంధ్ర ప్రదేశ్, యానాం, దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లోశనివారం,ఆదివారం, సోమవారం పొడివాతావరణం ఉంటుందని అంచనా వేసింది. తెలంగాణలోనూ పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 3 రోజుల్లో కోస్తాంధ్రలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

## మూడు దశాబ్దాల పోలీసు సేవలకు ఘన వీడ్కోలు

**కామారెడ్డి, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సైలు డి. శ్రీరామ్ మరియు డి. ఉదయ్ శేకర్ ల పదవీ విరమణ వేడుకను ఘనంగా నిర్వహించారు.37 ఏళ్లపాటు పోలీసు శాఖలో నిస్వార్థంగా సేవలందించిన ఈ ఇద్దరు అధికారులు తమ విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజల పట్ల సేవాభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్‌చంద్ర మాట్లాడుతూ, శ్రీరామ్ మరియు ఉదయ్ శేకర్ ల శాఖకు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సేవలను స్మరించుకుంటూ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.పోలీసు కుటుంబ సభ్యులు, సహచర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై పదవీ విరమణ పొందిన అధికారులకు సాదరంగా వీడ్కోలు పలికారు. సేవా కాలంలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వాతావరణం నెలకొంది. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ సేవా ప్రయాణం పూర్తి చేసిన ఈ అధికారులు తమ నిష్ఠతో పోలీసు శాఖలో చిరస్థాయిగా నిలిచే ముద్ర వేశారు.







## అరైవ్–అలైవ్ సందేశంతో విద్యార్థుల్లో చైతన్యం

- **దేవునిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పోలీస్ కళాబృందం అవగాహనా కార్యక్రమం**

**కామారెడ్డి, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎం. రాజేష్ చంద్ర, కామారెడ్డి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశానుసారం దేవునిపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ రంజిత్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా “అరైవ్-అలైవ్”, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, సైబర్ నేరాలు, వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులో వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, ప్రమాదాలకు దారి తీస్తుందని వివరించారు. సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటివి జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా జీవితాలను ప్రభావితం చేయవచ్చని హెచ్చరించారు.సైబర్ నేరాల బారిన పడితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను సంప్రదించాలని తెలిపారు. షీ టీమ్ సహాయం కోసం 8712686094 నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు.శేషరావు, పీసీ సాయిలు మాటలు, పాటల రూపంలో విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ పీసీ శ్రీభాను, పాఠశాల హెడ్ మాస్టర్ గంగాకిషన్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రమేష్, రాజు తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ తిరుమలలో బ్రహ్మోత్సవాల వైభవ ముగింపు

- **మహాపూర్ణాహుతి అనంతరం ఘనంగా చక్రస్నానం**
- **భారీగా తరలివచ్చిన భక్తులు**
- **కుటుంబ సమేతంగా పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**బీర్కూర్, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**

బీర్కూర్ శివారులోని తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజు సందర్భంగా నిర్వహించిన మహాపూర్ణాహుతి, అనంతరం జరిగిన శ్రీవారి పుష్కరిణి చక్రస్నానం కార్యక్రమం భక్తి పరవశంలో సాగింది. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఉత్సవాల్లో వేదమంత్రాల నడుమ మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రాన్ని ఆలయ పుష్కరిణిలో పవిత్ర స్నానానికి తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి హారతులు సమర్పించారు.ఈ మహోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి తన సతీమణి పుష్పతో కలిసి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. చక్రస్నానం అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పుష్కరిణిలో స్నానం చేసి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.అలాగే పోచారం శంభు రెడ్డి-ప్రేమల దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. మహిళలు, పురుషులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాల్లో భాగస్వాములయ్యారు.బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు, సేవాదారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు.చివరి రోజు జరిగిన చక్రస్నానం కార్యక్రమం భక్తి భావనల మధ్య ముగియగా, ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ఘన విజయవంతమయ్యాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, భారీ ఎత్తున భక్తులు పాల్గొనడంతో బీర్కూర్, తిమ్మాపూర్ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: ఎంపీ జి. నగేష్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి : 28 (డిడి9న్యూస్ ప్రతినిధి ):-**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి. నగేశ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా ) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరు, పథకాల అమలు తీరుపై ఎంపీ సుదీర్ఘంగా సమీక్ష జరిపారు.

**గడువులోగా లక్ష్యాల పూర్తి**

సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ గ్రాంట్లు, నిధుల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను రాబోయే 45 రోజుల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, 'ఇన్ టైమ్'లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు.

**రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం**

వ్యవసాయ రంగంపై సమీక్షిస్తూ, సాగు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమలుపై ఆరా తీశారు. ప్రతి రైతుకూ సాయిల్ హెల్త్ కార్డులు అందేలా జిల్లా వ్యవసాయ అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. పశువ్యాధి నియంత్రణ, ఉద్యానవన శాఖ ద్వారా అందుతు న్న ప్రోత్సాహకాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు.

**విద్య, వైద్యంపై ప్రత్యేక నిఘా**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీ సూచించారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. యువతకు పీఎం కౌశల్ వికాస్ యోజన ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.



**మౌలిక వసతులు - రవాణా సౌకర్యాలు**

ఉపాధి హామీ పథకం కింద గరిష్ఠంగా పనిదినాలు కల్పించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్డీఓను ఆదేశించారు. పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన గ్రామీణ రోడ్డు పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మున్సిపల్ పరిధిలో మిషన్ అమృత్ కింద తాగునీరు,మురుగునీటి పారుదల పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వీటితో పాటు జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటు, డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.సంక్షేమ పథకాలు మరియు గిరిజన అభివృద్ధి మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా చూడాలని అధికారులను కోరారు. గిరిజన ప్రాంతాల్లో పీఎం జన్మన్, పీఎం అజయ్ ప్రోగ్రామ్‌ల అమలును ప్రత్యేకంగా సమీక్షించారు. పీఎం ఆవాస్ యోజన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, జాతీయ రహదారుల నిర్మాణం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండాచూడాలని ఆయా శాఖల అధికారులను ఎంపీ ఆదేశించారు. సివిల్ సప్లై ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ పథకాలలో పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ,ఎంపీ సూచించిన విధంగా అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటామని వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్,డిఆర్డిఓ రవీందర్, వివిధశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# డిగ్రీ కళాశాల భవనం పై నుంచి దూకి రికార్డ్ అసిస్టెంట్ మృతి

**బాన్సువాడ, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**



బాన్సువాడ డిగ్రీ కళాశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేఖ్ అహ్మద్(50) కళాశాల భవనం పై అంతస్తు నుంచి దూకి మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. సహోద్యోగుల సమాచారం ప్రకారం, రెండంతస్తుల భవనం పై నుంచి కిందపడిన ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఘటన తెలిసిన వెంటనే కళాశాల సిబ్బంది, స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.సహోద్యోగుల వివరాల మేరకు, మృతుడికి మద్యపానం అలవాటు ఉండేదని, రమజాన్ మాసం సందర్భంగా కొన్నిరోజులుగా మానేసిన తర్వాత ఆయన ప్రవర్తనలో మార్పులు గమనించినట్లు తెలిపారు. అలాగే శనివారం ఉదయం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని చెప్పినట్లు సమాచారం.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషాద ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

---

# ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియా లో అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

- **టీపీసీసీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల**

**ఆదిలాబాద్ జిల్లా :(డి డి వార్త )**



నేడు సోనాల మండల కేంద్రంలో. టీపీసీసీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల.మాట్లాడుతూ ఇటీవలే బి ఆర్ ఎస్, బిజెపి పార్టీలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 5000 కోట్లతో గాంధీ విగ్రహం నిర్మిస్తున్నారని, సోషల్ మీడియాలో అసత్యపు పుకార్లను చేయిస్తూ సోషల్ మీడియాను పుకార్ల కోసం ఈ పార్టీలు వాడుకుంటున్నాయని ఇలాంటి దుష్ప్రచారాలు ఆ పార్టీలు చేయడం సిగ్గుచేటని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూడలేక ప్రజల్ని గందరగోళం చేసే ఉద్దేశంతో ఇలాంటివి చేస్తున్నారని ఇకనైనా మానుకోవాలని లేదంటే కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు చూస్తూ ఊరుకోరని ఇలాంటి ప్రచారాలు చేసే వారి పైన చట్టరీత్యా పోలీసు వారు కేసులు నమోదు చేయాలని రమేష్ బత్తుల. డిమాండ్ చేశారు.

---

# శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయ జీర్ణోదారణ కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా :(డి డి వార్త )**

బోథ్ పట్టణ శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయం పునః నిర్మాణ పనులు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ లో టెండర్ అనుమతులు పూర్తిచేసుకుని. మార్చి 4వ తేదీ 5వ తేదీలలో ఆదిలాబాదు పట్టణ వేదపండితుడు మేఘరాజ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ విగ్రహాల జీర్ణోదరణ, కార్యక్రమం నిర్వహించుచున్నామని .ఆలయ కమిటీ సభ్యులు తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని కోరడం జరిగింది.



---

# జాతీయ విజ్ఞాన దినోత్సవమును/నేషనల్ సైన్స్ డే

**ఆదిలాబాద్ జిల్లా :(డి డి వార్త )**

వివేకానంద పాఠశాలసోనాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులూ,పోషకుల సహాయంతో తయారుచేసిన వివిధ రకాల సైన్స్ ఎక్సిబిట్స్/ వర్కింగ్ మాడల్స్ ను ప్రదర్శించారు... ఈ ప్రదర్శనలో బోటనీ,జువాలజీ,సైన్స్ అండ్ టెక్నాలజి,సోషల్ స్టడీస్...etc మాడల్స్ ను పాఠశాల విద్యార్థులు,పోషకులు,ఉపాధ్యాయ బృందము తిలకించారు... జాతీయ విజ్ఞాన దినోత్సవమును భారత దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 న జరుపుకుంటారు. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28021928 న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్నాడు..అందువలన ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్ డే గా జరుపుకుంకుంటాము... ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య,డైరెక్టర్స్ ఓరుగంటి ఇస్తారి, కోస్మెట్ శుద్ధోధన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు...




---

# ప్రధాన రహదారి పక్కనే కల్తీ కల్లు దందా అధికారుల మౌనం పై ఆగ్రహం

- **పేరుకే కిరాణా దుకాణం... లోపల మాత్రం అక్రమ వ్యాపారం**
- **ప్రాణాలతో చెలగాటమా? మైనర్లకూ విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు**

**పిట్లం, ఫిబ్రవరి 28(డిడి9 వార్త):**



కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని బోల్లక్ పల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే కల్తీ కల్లు దందా దర్జాగా కొనసాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పేరుకే కిరాణా దుకాణంగా నడుస్తున్న ఈ దుకాణంలో లోపల మాత్రం పూర్తిగా కల్తీ కల్లు విక్రయాలు సాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.కిరాణా దుకాణంలోని ఫ్రిజ్‌లలో కల్తీ కల్లు నిల్వ చేసి, దుకాణం అడ్డుగా వాహనాలు పార్క్ చేసి బహిరంగంగానే విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరంగా ఈ దందా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రాణనష్టం జరిగిందన్న ఆవేదన గతంలో ఇక్కడ కల్లు సేవించి పలువురు ప్రాణాలు కోల్పోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీ కల్లు మాత్రమే కాకుండా ప్రమాదకర రసాయనాలు కలుపుతున్నారని, దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నాయని అంటున్నారు. యువత వ్యసనాలకు బానిసలవుతుండగా, మైనర్ చిన్నారులకు సైతం కల్లు ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**రాజకీయ అండ ఉందా? అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి**

తనిఖీల పేరుతో కాలయాపన తప్ప అసలు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ దందాకు రాజకీయ, అధికార అండ ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "గీసేది గోరంత... కల్తీ చేసేది కొండంత" అంటూ సామాన్యుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై కేసులు నమోదు చేసి, లైసెన్సులు వెంటనే రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ వివరణ**

ఈ విషయమై ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను సంప్రదించగా, గతంలో పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిర్వాహకులు తీరు మార్చుకోలేదని తెలిపారు. రోడ్డు పక్కన కాకుండా గ్రామంలో నిర్వహించాలని సూచించామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



---

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి.

- **ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం....**

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 28 (డిడి9వార్త ):-**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలం లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించారు. కురుక్షేత్ర పాఠశాలలో విద్యార్థులు పలు విధాలసైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. సైన్స్‌క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కురుక్షేత్ర పాఠశాల ప్రిన్సిపల్ సబ్బిడి నవీన్ కుమార్ మాట్లాడుతూ సైన్స్‌తోనే దేశం అభివృద్ధి జరుగుతుందని, కరోనా వంటి కష్ట కాలంలోనూ మన శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ తయారు చేసి ఎన్నో దేశాల ప్రజలను కాపాడారని,విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్లు ఎంతగానో దోహద పడుతాయని, సాంకేతికతను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వివిధ రకాల శాస్త్రవేత్తలు చేసిన గొప్ప ప్రయత్నాలు ఎలాంటి ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయో విద్యార్థులకు చెప్పారు.ఈ కార్యక్రమంలో పోషకులు,పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



---

# గోమాతలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

ఆర్మూర్ పట్టణంలోని ప్రధాన రహదారులపై గోవుల సంచారం పెరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై మున్సిపల్ యంత్రాంగం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ ఆర్మూర్ శాఖ డిమాండ్ చేసింది. శనివారం విశ్వ హిందూ పరిషత్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లపై గోమాతలు ఉండటం వల్ల వాటికి ప్రమాదాలు జరగడమే కాకుండా వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురై ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై తిరుగుతున్న గోవులను ట్యాగింగ్ ద్వారా గుర్తించి వాటి యజమానులకు అప్పగించాలని, ఒకవేళ యజమానులు బాధ్యత వహించని పక్షంలో ఆ గోవులను తక్షణమే సమీపంలోని గోశాలలకు తరలించి సంరక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు. గోవుల సమస్యతో పాటు పట్టణంలో కోతులు, వీధి కుక్కల బెడద కూడా విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, విశేష సంపర్క ప్రముఖ్ అల్జపూర్ అక్షయ్, ప్రచార ప్రముఖ్ నిఖిల్, బజరంగ్ దళ్ సురక్ష ప్రముఖ్ కందురు ప్రవీణ్, సహ కార్యదర్శి మగ్గిడి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



---

# అశోక్ సాగర్‌లో పడి ఖానాపూర్ వ్యక్తి మృతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**



నిజామాబాద్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఈమాడే మస్నాజీ (55) అశోక్ సాగర్‌లో పడి మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మస్నాజీ శుక్రవారం ఉదయం తన పని నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరారు. మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య అంజన్బాయి ఆయనకు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అశోక్ సాగర్ గట్టుపై మస్నాజీకి చెందిన ద్విచక్ర వాహనం, ఫోన్ ఉన్నట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు తక్షణమే అక్కడికి చేరుకున్నారు. చెరువు వద్ద వెతకగా మస్నాజీ మృతదేహం నీటిలో తేలుతూ కనిపించడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య అంజన్బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై సమీక్ష సమావేశం

**కామారెడ్డి, ఫిబ్రవరి 28(డిడి9 వార్త)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు పురోగతిపై రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, అధిక సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. పని ప్రదేశాలలో కూలీలకు అవసరమైన నీడ, త్రాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలోని అన్ని అనుమతించబడిన పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణయించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాలను సాధించాలన్నారు. లక్ష్యాలను సాధించకపోతే సంబంధిత ఎంపీడీవోలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కామారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, జిల్లాలోని మండల ఎంపీడీవోలు మరియు ఏపీవోలు పాల్గొన్నారు.తదనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఐడీఓసీలో ఎంపీడీవోలు, ఏపీవోలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అలాగే కమిషనర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, లేబర్ మొబిలైజేషన్‌ను పెంచాలని, ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## యూరియా కొరత తీర్చాలి..

- **శనగ కొనుగోలు కేంద్రాలు తెరవాలి**
- **అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు రోడ్డున పడుతున్నారని, వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతున్నా పాలకులకు పట్టింపు లేదని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్, పుట్టిన నడిపి నాగన్న విమర్శించారు. శనివారం బోధన్ డివిజన్ పరిధిలోని రైతుల సమస్యలపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. డివిజన్ వ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా ఉందని, వరి పంట పొట్ట దశలో ఉన్న తరుణంలో ఎరువులు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. సొసైటీల ముందు రైతులు క్యూ కడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే సరిపడా యూరియా నిల్వలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలో సాగు చేసిన శనగ పంట ప్రస్తుతం కోతకు వచ్చిందని, వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. క్వింటాలు శనగలకు రూ. 8 వేలు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వెంటనే సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వర్షాకాలంలో మంజీరా, గోదావరి నదుల ఉధృతికి సోయా, పత్తి పంటలు వేల ఎకరాల్లో నీటమునిగాయి. అధికారులు హడావుడిగా సర్వే చేశారే తప్ప, ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. యాసంగి సీజన్ ముగుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత 'రైతు భరోసా' ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించి నెల రోజులు గడుస్తున్నా, ఇంకా అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులకు, బీడీ కార్మికులకు రూ. 4 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సుల్తాన్ సాయిలు, కాశ రవి, పసుల గోపాల్, సిద్ధ పోశెట్టి, మిద్దె పెద్దలు సుదర్శన్, హనుమాన్లు, గంగారాం, పెద్ద గంగారాం, చింతల పోశెట్టి, మన్నే పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.






## బోధన్ మీసేవ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

ఉమ్మడి బోధన్ మండల మీసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విట్టల్, బోధన్ మరియు సాలూర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీసేవ యూనియన్ అధ్యక్షులు దెమ్మాట రవీందర్ మాట్లాడుతూ.. మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతో సామాన్యులకు ప్రభుత్వ సేవలను వేగంగా చేరవేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ యూనియన్ సభ్యులు, ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఉపాధి రంగాల్లో రాణించాలి

- **జిల్లా కలెక్టర్ పిలుపు**
- **ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో టూల్ కిట్ల పంపిణీ**

**నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

మహిళలు కేవలం గృహిణులుగా ఇంటికే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యాపార, ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆమె, అక్కడ అందుతున్న శిక్షణ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముచ్చటించి వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు బాగుంటాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మరియు బ్యాంకుల ద్వారా అందుతున్న ఇలాంటి ఉచిత శిక్షణ అవకాశాలను మహిళలు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. శిక్షణ పొందిన నైపుణ్యానికి పట్టుదల తోడైతే సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి మరికొంతమందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదుగుతారని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, నేర్చుకున్న విద్యను వృత్తిగా మలచుకుని ఆర్థిక భరోసా పొందాలని సూచించారు. అనంతరం టైలరింగ్, మగ్గం పని, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధికి అవసరమైన టూల్ కిట్లను ఆమె అందజేశారు. ఈ ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని తక్షణమే ఉపాధి మార్గాలను ప్రారంభించాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఏజీఎం రంజిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు అండగా నిలవడమే తమ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు యూనిట్లు స్థాపించుకోవడానికి అవసరమైన రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రవి, శిక్షణ కేంద్రం సిబ్బంది, బ్యాంక్ అధికారులు, మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.






## శాస్త్రీయ దృక్పథంతోనే ఉన్నత శిఖరాలకు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకున్నప్పుడే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, బంజా శంకర్ పేర్కొన్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సైన్స్ ఉపాధ్యాయుల ప్రత్యేక మార్గదర్శకత్వంలో విద్యార్థులు గాలి పీడనం, నీటి శుద్ధి ప్రక్రియ, గురుత్వాకర్షణ శక్తి మరియు సౌర కుటుంబం (సోలార్ సిస్టమ్) వంటి కీలక అంశాలపై అద్భుతమైన నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాల పనితీరును అతిథులకు వివరించిన తీరు వారి సృజనాత్మకతకు అద్దం పట్టింది. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి అంశం వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను అన్వేషించాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మార్చి 3న చంద్రగ్రహణం.. మధ్యాహ్నం నుంచే హోలీ జరుపుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

ఈ నెల 3వ తేదీన చంద్రగ్రహణం ఏర్పడనుందని బోధన్ పట్టణంలోని మారుతి మందిరం ప్రధాన అర్చకుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో పండుగలు, శుభకార్యాల నిర్వహణలో భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రహణ ప్రభావం కారణంగా పండుగ తిథులలో స్వల్ప మార్పులు ఉంటాయని ఆయన వివరించారు. వచ్చే సోమవారం కామదహనం నిర్వహించుకోవాలని, మంగళవారం హోలీ పండుగ జరుపుకోవాలని స్పష్టం చేశారు. గ్రహణ సమయ వివరాలను వెల్లడిస్తూ.. మంగళవారం మధ్యాహ్నం 3:15 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై, సాయంత్రం 6:47 గంటలకు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హోలీ పండుగ వేడుకలను మంగళవారం ఉదయం నుంచే ప్రారంభించి, గ్రహణ సమయానికి ముందే అంటే మధ్యాహ్నం 3 గంటల లోపు పూర్తి చేసుకోవాలని భక్తులకు సూచించారు. గ్రహణ సమయంలో దేవాలయాల తలుపులు మూసివేస్తారని, మోక్షానంతరం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారని ఆయన తెలిపారు.



## జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డుపైకి లారీ దూసుకోచ్చి విధ్వంసం.

- **మహిళ మృతి, పలువురికి గాయాలు.**
- **రిమ్స్ ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు**

**బజార్హత్నూర్, ఫిబ్రవరి 28(డిడి9న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం జవహర్ నగర్ వద్ద శనివారం సాయంత్రం 4.15 ల ప్రాంతంలో లారీ భీభత్సం సృష్టించడంతోకార్కుప్రమాదంజరిగింది.అందులో ప్రయాణం చేస్తున్న వారిలో మహిళ మరణించాగా, పలువురికి గాయాలు అయ్యాయని ప్రత్యేక్ష సాక్షులుపేర్కొన్నారు.కార్నెంబర్TSO7FL9527.లారీ భీభత్సం సృష్టించటం తో ఈ సంఘటన చోటు చేసుకోంది.జవహర్ నగర్ హనుమాన్ మందిరం వద్ద జాతీయ రహదారి పై నుంచి సర్వీస్ రోడ్డుపైకి లారీ దూసుకెళ్లి పలు వాహనాలను ద్వంసం చేసింది.అక్కడున్న జనాలు ఒక్కసారిగా భయంతో వణికి పోయారు.లారీ డీ కొని ఒక మహిళ మృతి చెందారు. ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అవడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు గుమి గూడి సహాయక చేపట్టారు.



## వృత్తి నైపుణ్యంతోనే గుర్తింపు

- **ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

మేరు కులస్థులు తమ వృత్తికి ఇచ్చే ప్రాధాన్యత, సంప్రదాయాల పట్ల వారికున్న గౌరవం ఎందరికో ఆదర్శమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా కొనియాడారు. అంతర్జాతీయ టైలర్స్ డే పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తన సొంత ట్రస్ట్ ద్వారా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేరు కులస్థులు ప్రతిరోజూ తమ పనిని ప్రారంభించే ముందు కుట్టు మిషన్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వృత్తిని దైవంగా భావించడం వారి సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు. సమాజంలో టైలర్ల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరిని అందంగా తీర్చిదిద్దే నైపుణ్యం వారి సొంతమని ప్రశంసించారు. మేరు కులస్థుల మధ్య ఉన్న ఐక్యత అభినందనీయమని ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి తమ వర్గ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాల సాధనలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులో మేరు కులస్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేరు కుల సంఘం ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, టైలర్లు పాల్గొన్నారు.




## తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండల ప్రదీప్

**నిజామాబాద్ జిల్లా 28ఫిబ్రవరి( డీడీ9 వార్త):**

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ విద్యార్థి నాయకుడు ఎండల ప్రదీప్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ప్రదీప్ క్రియాశీలక పాత్ర పోషించారని, ఆయన నాయకత్వంలో ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత పటిష్టంగా పని చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఎండల ప్రదీప్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.



# ‘ధురంధర్: ది రివెంజ్’ ఈసారి ఐదు భాషల్లో..

రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్’. గతేడాది విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. కేవలం హిందీలో మాత్రమే విడుదలైనా కాసుల వర్షాన్ని కురిపించింది. ఆ మూవీకి కొనసాగింపుగా ‘ధురంధర్2: ది రివెంజ్’ ఇప్పటికే సిద్ధమైన సంగతి తెలిసిందే. తొలి భాగంతో పోలిస్తే, ఈసారి యాక్షన్ థ్రిల్ డబుల్ ఉంటాయని ప్రచార చిత్రాలు చెబుతున్నాయి. హిందీతో పాటు, దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ‘ధురంధర్2’ రానుంది. ఈ సందర్భంగా ఈ విషయాన్ని మరోసారి ధ్రువీకరిస్తూ ప్రొడక్షన్ హౌస్ జియో స్టూడియో పోస్ట్‌ను పంచుకుంది. ‘‘ది రివెంజ్’కు కౌంట్ డౌన్ మొదలైంది’’ అని పేర్కొంది.

మరోవైపు ఈ మూవీ రన్‌టైమ్‌పై ప్రస్తుతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. ‘ధురంధర్ 2: ది రివెంజ్’ నిడివి 3 గంటల 40 నిమిషాలకు లాక్ చేశారట. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే కాస్త ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలుపుకొంటే దాదాపు నాలుగు గంటలు సమయం ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. మరి సినిమాలో అంత బలమైన కంటెంట్ ఉందా? అంటే ఈ విషయంలో ఆదిత్య ధర్ ఏ మాత్రం



వెనక్కి తగ్గేదిలే లేదంటున్నారట. నాలుగు గంటల రన్‌టైమ్ ఫైనల్ కట్‌ను సిద్ధం చేసి, స్వల్ప మార్పులతో 3 గంటలా 40 నిమిషాల ఫుటేజ్‌ను సెన్సార్‌కు పంపారట. మరి సెన్సార్ కట్స్ చెబుతుందా? లేదా అన్నది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాలి. ఇక ‘ధురంధర్2’ మార్చి 19న థియేటర్స్‌లో సందడి చేయనుంది.

# అందాలతో మత్తెక్కిస్తున్న ప్రభాస్

రిద్ధి కుమార్ 2018లో విడుదల అయిన లవర్ సినిమాతో వెండితెరకు పరిచయం అయింది. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాంతో ఈ ముద్దుగుమ్మకు పెద్దగా అవకాశాలు రాలేదు. ఆ తర్వాత ఈ బ్యూటీ చిన్న సినిమాల్లో నటిస్తూ కెరియర్ను ముందుకు సాగించింది. అలాంటి సమయంలోనే రిద్ధి కుమార్, ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన 'రాజా సాబ్'లో అవకాశం అందుకుంది. దాంతో ఒక్క సారిగా ఈమె పేరు వైరల్ కావడం మొదలైంది. అయితే, ఈ సంక్రాంతికి రాజా సాబ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఈ చిత్రం జనాల్ని పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఇందులో ఈమె తన అందంతో ప్రేక్షకులను బాగా అలరించింది. ప్రభాస్ లాంటి స్టార్ హీరో సినిమాలో హీరోయిన్గా నటించడంతో రిద్ధి కుమార్ వరుస పెట్టి సినిమాల్లో అవకాశాలను అందుకుంటుందని చాలామంది భావిస్తున్నారు. ఈ నటి సినిమాల విషయం కాసేపు పక్కన పెడితే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో అనేక విషయాలు పంచుకుంటుండడంతో ఈమెకు అనేకమంది ఫాలోవర్స్ కూడా ఉన్నారు.

ఈమె అప్పుడప్పుడు తనకు సంబంధించిన హాట్ ఫోటోలను కూడా అందులో పోస్ట్ చేస్తూ వస్తుంది, అవి సూపర్ గా వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన కొన్ని ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అందులో ఈ హీరోయిన్ సూపర్ హాట్ లుక్లో ఉన్న స్లీవ్ లెస్ డ్రెస్ వేసుకొని తన ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇచ్చింది, ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి.



# సోలో ట్రిప్.. మీరేంటో చెబుతుంది



జీవితంలో మీరు ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయకపోతే.. నిజంగా మీకేది ఇష్టమో అనేది తెలియదంటోంది నటి షాలినీ పాండే. ‘అర్జున్‌రెడ్డి’ చిత్రంతో అందర్నీ ఆకర్షించిన ఈమె గతేడాది ఓటీటీలో ‘డబ్బా కార్టెల్’ సిరీస్‌తో ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ‘బంద్‌వాలే’ సిరీస్‌తో అమెజాన్ ప్రైమ్ వేదికగా సందడి చేస్తోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. “నటిగా నా పని ఒక పాత్రను పోషించి దానిని వాస్తవంగా చూపిస్తూ తెరపై అలరించడం. కానీ, నిజజీవితం గురించి నేను చాలా విషయాలను తెలుసుకోవాలనుకుంటాను. దాని కోసం చిన్న చిన్న గ్రామాలకు సోలో ట్రిప్పులు వెళుతుంటాను. జీవితంలో ఒక్కసారైనా సోలో ట్రిప్ చేయాలి. అలా చేయకపోతే.. నిజంగా మీ ఇష్టాలు ఏంటనేది మీకు తెలియవు. మీరు ఎవరితోనైనా ఉన్నప్పుడు ప్రతిదాని గురించి అభిప్రాయాలను పంచుకుంటూ ఉంటారు. కానీ, ఎవరులేని సందర్భాల్లో మీతో మీరు ఉండగలరా? మీకు మీరంటే ఇష్టమేనా? అనేది కూడా తెలుసుకోవాలి. అలాంటప్పుడు ఆ ఒక్క ఒంటరి ప్రయాణం చేసినప్పుడు మిమ్మల్ని మీరు గ్రహిస్తారు. ప్రయాణం జీవితంలో మార్పులు తెస్తుంది. అపరిచితులను కలవడం.. వెళ్లిన ప్రదేశాల గురించి తెలుసుకుని స్థానికుల దృష్టితో వాటిని చూడటం. అలా మనమెవరో తెలియకపోయినా అక్కడి వాళ్లు పంచే ఆత్మీయత చాలా మంచి అనుభూతినిస్తుంది. వ్యక్తులతో సంభాషించడం, నగరాలను అన్వేషిస్తూ సంస్కృతిని అర్థంచేసుకోవడం భిన్నమైన ప్రయాణం. అందరికీ ఇలా అనిపిస్తుందో లేదో కానీ, నాకు మాత్రం ట్రిప్ తర్వాత నన్ను నేను బాగా తెలుసుకున్నాననే భావనకలుగుతుంద”ని చెప్పుకొచ్చింది.

# అగ్ర హీరో సరసన మీనాక్షి?



తెలుగులో అగ్రకథానాయకులతోపాటు యువ హీరోల సరసన నటిస్తూ వరుస విజయాలతో జోరుమీదుంది హీరోయిన్ మీనాక్షి చౌదరి. ముగ్గుల పండక్కి ‘అనగనగా ఒక రాజు’ సినిమాలో చారులతగా కనిపించి.. ఈ ఏడాదిని మంచి విజయంతో ఆరంభించిందీ భామ. తాజాగా ఆమె బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్‌తో జంట కట్టనుందట. ప్రియదర్శన్ దర్శకత్వంలో 2006లో విడుదలైన కామెడీ థ్రిల్లర్ ‘భాగమ్ భాగ్’ సినిమా సీక్వెల్‌లో ఆమె కనిపించనుందని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

“ప్రియదర్శన్ ప్రస్తుతం అక్షయ్‌కి సంబంధించిన మూడు చిత్రాలను తెరకెక్కించే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పుడాయన రూపొందిచాలనుకున్న ‘భాగమ్ భాగ్’ సీక్వెల్ బాధ్యతల్ని రాజ్ శాండిల్యకు అప్పగించారు. అక్షయ్ హీరోగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో మీనాక్షి చౌదరి, ‘ధురంధర్’ సినిమాలో ప్రత్యేక గీతంలో అలరించిన ఆయేషా ఖాన్‌ను కథానాయికలుగా నటించనున్నార”ని హిందీ చిత్రవర్గాల సమాచారం. మీనాక్షి ప్రస్తుతం హీరో నాగచైతన్య నటిస్తున్న ‘వృషకర్మ’ సినిమాతో బిజీగా ఉంది.

# అభిషేక్ బాబీ దేఒల్ కాంబోలో కొత్త చిత్రం?

‘రాజా శివాజీ’, ‘కింగ్’ చిత్రాలతో ఈ ఏడాది ప్రేక్షకులను అలరించేందుకు సన్నద్ధమవుతున్నారు బాలీవుడ్ కథానాయకుడు అభిషేక్ బచ్చన్. ఇప్పుడాయన బాబీ దేఒల్ కాంబోలో హిందీ చిత్రనిర్మాత దీపక్ ముకుత్ ఓ మల్టిస్టారర్ చిత్రాన్ని రూపొందిచాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. ‘గోల్‌మాల్ 5’ సినిమాని ‘దో ఔర్ దో పాంచ్’ చిత్ర రీమేక్ అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో స్పందిస్తూ.. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి పంచుకున్నారు. ‘‘ఇతరులెవరో ‘దో ఔర్ దో పాంచ్’ సినిమా రీమేక్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవి ఎక్కడి నుంచి వస్తున్నాయో నాకు తెలీదు. అందుకే ఈ రీమేక్ హక్కులను సొంతం చేసుకున్నట్లు పబ్లిక్ నోటీసు జారీ చేయాల్సి వచ్చింది. ఈ సినిమాని రీమేక్ చేయాలని నేను గత పదేళ్లుగా ప్రణాళిక చేస్తున్నాను. బాబీ దేఒల్, అభిషేక్ బచ్చన్‌లతో కలిసి ఈ సినిమాని చేయాలనుకుంటున్నాన’’ని నిర్మాత చెప్పినట్లు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి. 1980లో విడుదలైన ‘దో ఔర్ దో పాంచ్’ చిత్రాన్ని రాకేశ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో అమితాబ్ బచ్చన్, శశి కపూర్, హేమా మాలిని ప్రధానపాత్రల్లో నటించారు.





## యుద్ధ మేఘాల మధ్య ‘డ్రాగన్’ షూటింగ్..

# చివరి నిమిషంలో ఎన్టీఆర్ సేఫ్!

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు టాలీవుడ్‌ను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న భీకర పోరుతో అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతుండగా, మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రం 'డ్రాగన్' చిత్ర యూనిట్ తృటిలో పెను ముప్పు నుంచి తప్పించుకున్నట్లైంది. గత కొన్ని రోజులుగా ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య దాడులు ప్రతిదాడులతో పరిస్థితులు యుద్ధానికి దారితీశాయి. అమెరికా బేస్ క్యాంపులపై ఇరాన్ దాడులు చేయడంతో, భద్రతా కారణాల దృష్ట్యా జోర్డాన్, ఇరాక్, యూఏఈ వంటి దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. జోర్డాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా భారతీయులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సరిగ్గా ఇదే సమయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ బృందం జోర్డాన్‌లో షూటింగ్‌లో ఉండటంతో అభిమానుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

**దర్శకుడి ముందస్తు జాగ్రత్త..**

నిజానికి ఈ షెడ్యూల్ మార్చి మొదటి వారం వరకు కొనసాగాల్సి ఉంది. అయితే, అక్కడి మారుతున్న రాజకీయ పరిణామాలను, యుద్ధ వాతావరణాన్ని ముందే పసిగట్టిన దర్శకుడు ప్రశాంత్ నీల్ అప్రమత్తమైనట్లు తెలిసింది. ప్లాన్ చేసిన దానికంటే ముందే పనులను వేగవంతం చేసి, ఫిబ్రవరి 22నే షూటింగ్ ముగించుకుని చిత్ర యూనిట్‌తో కలిసి ఇండియాకు తిరుగు ప్రయాణమయ్యారు. ఒకవేళ మరో నాలుగు రోజులు ఆలస్యమై ఉంటే, విమాన రాకపోకలు నిలిచిపోయి వందలాది మంది చిత్ర సభ్యులతో పాటు ఎన్టీఆర్ కూడా అక్కడే చిక్కుకుపోయే పరిస్థితి ఉండేదని టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ఎడారిలో భారీ యాక్షన్ సీక్వెన్స్..!**

ఈ జోర్డాన్ షెడ్యూల్‌లో సినిమాకే అత్యంత కీలకమైన ఘట్టాలను చిత్రీకరించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. జోర్డాన్ ఎడారి ప్రాంతాల్లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను ఎన్టీఆర్ డూప్ లేకుండా స్వయంగా చేశారని తెలుస్తోంది. ఒక భారీ బడ్జెట్ సాంగ్‌ను కూడా అక్కడి అద్భుతమైన లొకేషన్లలో షూట్ చేశారని సమాచారం. ఎన్టీఆర్ సురక్షితంగా హైదరాబాద్ చేరుకోవడంతో నందమూరి అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై జరగబోయే షూటింగ్ అంతా రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరగనున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్న ఈ చిత్రం 2026, జూన్ 25న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

